క్లుప్తంగా

గడియార స్తంభం పనుల పరిశీలన


సిబ్బందికి సూచనలిస్తున్న ఏఈ రమేష్‌బాబు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో నిర్మిస్తున్న గడియారం స్తంభం పనులను మున్సిపల్ ఏఈ ఎం.రమేష్‌బాబు సోమవారం పరిశీలించారు. ఇప్పటికే గడియారం ఏర్పాటు చేయడంతో సోమవారం గ్రిల్స్ ఏర్పాటు పనులు పరిశీలించారు. ఈ మేరకు ఆ పనులను ఏఈ పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు ఇచ్చారు. ఈ నెలలో ప్రారంభించేలా గడియారం స్తంభాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

సామర్లకోట: స్థానిక పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఇప్పటి వరకు కాకినాడ సెంటర్‌గా ఉండగా, విద్యార్థుల వినతుల మేరకు సామర్లకోటలో మూడు పరీక్షా కేంద్రాలను కేటాయించారు. పట్టణంలో 781 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 747 మంది పరీక్షలు రాసారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 297 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 278 మంది, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో 168 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 163 మంది, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 316 మందికి 306 మంది పరీక్షలు రాసిన్నట్లు ఆయా పాఠశాలల ఇన్‌చార్జిలు తెలిపారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


బ్యాగ్‌ను యజమానికి అందజేసిన ఆటో యూనియన్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక శ్రీ సాయిగణపతి ఆటో యూనియన్‌కు చెందిన ఒక ఆటో డ్రైవరు సోమవారం తన నిజాయితీని చాటుకున్నాడు. తన ఆటోలో ప్రయాణికులను దింపిన తరువాత శుభ్రం చేస్తున్న సమయంలో ఆటోలో ఒక బ్యాగ్‌ను డ్రైవరు గొల్లపల్లి సత్తిబాబు గమనించాడు. బ్యాగ్ తెరచి చూడాగా దానికి స్కూల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, రేషన్ కార్డు, రూ.3,600 నగదు ఉన్నట్లు గమనించాడు. వెంటనే విషయాన్ని యూనియన్ ప్రతినిధులకు తెలియజేశాడు. బ్యాగ్‌లో లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా ప్రయాణికునికి సమాచారం ఇచ్చారు. ఆటో యూనియన్ కార్యాలయానికి వచ్చిన ప్రయాణికునికి బ్యాగ్‌ను అందజేశారు. ఆటో డ్రైవర్ నిజాయితీపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

టాటాకు ఘన నివాళి


టాటా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: మండలంలోని రామారావుపేటలో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల ఆవరణలో గల టాటా గ్రూప్ అధినేత జంషెడ్జీ టాటా విగ్రహానికి సోమవారం ఘన నివాళులర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ కో ఆర్డినేటర్ ప్రశాంతి మాట్లాడుతూ టాటాను భారతీయ పరిశ్రమల పితామహుడిగా అభివర్ణిస్తారని, ఆయన పారిశ్రామిక ప్రపంచంతో ఎంత ప్రభావం చూపించారని, స్వాతంత్ర్య ఉద్యమంలో మన దేశానికి ఆర్థికంగా ఎంతో వెన్నుదన్నుగా నిలిచారన్నారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మీడియా కో ఆర్డినేటర్ ఉషా చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారా రామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. ఫాల్గుణ మాసం తొలి సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో నిర్వహించిన తొలి అభిషేకం, తొలిపూజలను తిలకించడానికి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

చెరువుల్లో రసాయనాల వినియోగం

- నాచు జాతి మొక్కలను చంపేందుకు వాడకం
- కలుషితమవుతున్న జలాలు
- పట్టించుకోని అధికారులు


కొత్తపల్లిలో రసాయనాల వినియోగం వల్ల కాలుష్యపు కోరల్లో చిక్కుకున్న చెరువు

కొత్తపల్లి: చెరువుల్లోని కొంతమంది చేపల వ్యాపారులు నాచుజాతి మొక్కలను చంపేందుకు రసాయనాలను వినియోగిస్తున్నారు. ఈ రసాయనాలను వినియోగంచడం వల్ల నీరు కలుషితమవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేసున్నారు. నాచు మొక్కలు తొలగించాల్సి వలసి ఉండగా వ్యాపారులు మాత్రం రసాయనాలతో ఆ మొక్కలను చంపుతున్నారు. దీని వల్ల నీరు కలుషితమై పశువులు తాగేందుకు సైతం వీల్లేని పరిస్థితి ఏర్పడుతోంది. కుతుకుడుమిల్లి శివారు పెద్ద కలవలదొడ్డిలో ఉన్న చెరువులోని నాచుమొక్కలను చంపేందుకు రసాయనాలు వినియోగించడంతో చెరువులోని నాచు మొక్కలు చనిపోయాయి. అంతే కాకుండా చెరువులో పెరిగే చేపలకు కూడా విష ప్రభావం ఉందని స్థానికులు చెబుతున్నారు.

రసాయనాలు వినియోగించకూడదు

పశువులు నీరు తాగే చెరువులు, చేపల పెంపకం చేపట్టే చెరువులలో ఎటువంటి రసాయనాలను వినియోగించరాదు. ఈ రసాయనాల వినియోగం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్రం ప్రభావం పడుతుంది. అయినప్పటికీ చెరువుల లీజుదారులు ఎటువంటి అనుమతులు లేకుండా విష ప్రభావం ఉన్న రసాయనాలను విచ్చల విడిగా వినియోగిస్తున్నారు.

పశువులు నీరు తాగడంలేదు

చెరువులో ఉన్న నాచు మొక్కలను చంపేందుకు రసాయనాలు చల్లుతుండడంతో పశువులు ఆ నీటిని వాసన చూసి తాగకుండా వెళ్లిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ నీటిని తాగడం వల్ల పశువులు కూడా అనారోగ్యం పాలవుతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **చెరువులను పాడుచేయవద్దు**
>
> గ్రామాల్లోని చెరువుల్లో ఎటువంటి రసాయనాలు ఉపయోగించరాదు. చేపల పెంపకం దారులు చెరువుల్లో జీవ వ్యర్థాలను విడిచిపెట్టరాదు. ప్రజలకుల హాని కలిగించే రసాయనాలు ఉపయోగించకూడదు. చెరువులను పాడుచేయకుండా శుభ్రంగా ఉంచాలి.
>
> – కర్రి హరికృష్ణసత్యారెడ్డి, ఈఓపీఆర్డీ కొత్తపల్లి

పట్టించుకోని అధికారులు

చెరువుల్లో విషపూరిత రసాయనాలు, ఇతర మృత జీవ వ్యర్థాలను చెరువుల్లో విచ్చల విడిగా వినియోగిస్తున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు చెబుతున్నారు. చెరువుల లీజు వ్యాపారుల నుంచి అధికారులు మామూళ్లు పుచ్చుకోవడం వలనే పట్టించుకోవడంలేని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు ఉపాధ్యాయులపై విచారణ


వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లోని ఇద్దరు ఉపాధ్యాయులపై అందిన ఫిర్యాదుల మేరకు వివిధ శాఖల అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. విద్యార్థినుల పట్ల వారు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ట్రైనీ కలెక్టర్ భావనకు ఫిర్యాదు అందింది. ఆమె ఆదేశాలతో ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, సీడీపీఓ ఉష, ఎంఈఓ–2 పి.పుల్లయ్య, జీసీడీఓ ఉమామహేశ్వరీ ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుమారు ఐదు గంటల పాటు విచారణ చేశారు. ఈ మేరకు పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. దీనిపై ఎంఈఓ–2 పి.పుల్లయ్యను వివరణ కోరగా అధికారుల ఆదేశాల మేరకు విచారణ గోప్యంగా నిర్వహించారని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు.

నేడు వేలంపాట

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శివారున ఉన్న నాగులాపల్లి ఏరియా రక్షిత నీటి పథకంలో ఉన్న కొబ్బరి, మామిడి ఫలసాయం వేలం పాటను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ సోమవారం తెలిపారు. నాగులాపల్లి పంచాయతీలో 11.30 గంటలకు ఈ వేలం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనేవారు సాల్వెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. పథకంలో ఉన్న 22 కొబ్బరి చెట్లు, 8 మామిడి చెట్లుకు 31 డిసెంబర్ 2027 వరకు పాట జరుగుతుందని ఆయన తెలిపారు.

కంటి చూపుపై శ్రద్ధ చూపాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య


విద్యార్థినులకు కంటి అద్దాలు అందజేస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

సామర్లకోట: విద్యార్థులు కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. విద్యార్థుల సంరక్షణ పోషణ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కంటి పరీక్షలు చేసుకున్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టీవీ, సెల్ ఫోన్లు చూడటం తగ్గించుకోవాలన్నారు. దీనికి తోడు ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కంటి చూపుపై జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ప్రతి పాఠశాలలోను కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు 45 కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యు.మీనామాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్

పెద్దాపురం: మండలంలోని ఆర్‌బీ పట్నం విద్యార్థుల మరుగుదొడ్ల సమస్యపై సోమవారం ప్రచురితమైన 'మరుగుదొడ్లు శుభ్రపర్చండి మహప్రభో' కథనానికి జిల్లా విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. పాఠశాల చైర్మన్ మన్యం చిన్నతో పాటు విద్యార్థులు చేపట్టిన నిరసనపై పత్రికల్లో వచ్చిన కథనం నేపథ్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. మరుగుదొడ్ల శుభ్రతలో పూర్తిగా విఫలమయ్యారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మరుగుదొడ్ల నిర్వహణకు ఇద్దరు వ్యక్తులచే బేషరతుగా శుభ్రం చేయించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంఈఓ చౌదరి సిబ్బందిని ఆదేశించారు. తొలుత మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీసి, విచారణ చేపట్టారు.


ఆర్‌బీ పట్నం పాఠశాలలో విద్యార్థుల సమస్యలపై ఆరా తీస్తున్న ఎంఈఓ

బాల్య వివాహాలపై అవగాహన అవసరం


వాకతిప్ప జెడ్పీ పాఠశాలలో కొవ్వొత్తులు వెలిగించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాకతిప్పలోని జెడ్పీ పాఠశాలలో సోమవారం పిఠాపురం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తులు వెలిగించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ యూవీవీ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో సేవా గుణం

- దాతల సహకారంతో రామాలయ నిర్మాణం అభినందనీయం
- దవులూరి దొరబాబు


గొంచాల గ్రామం రామాలయంలోని విగ్రహాల ప్రతిష్ఠలో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవడం ద్వారా ఇతరులకు సేవ చేయాలనే ఆలోచన కలుగుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలో గొంచాల గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన రామాలయంలో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు. గత 14 ఏళ్లగా గొంచాల గ్రామం నుంచి భక్తులు భద్రాచలానికి పాద యాత్రగా వెళ్లడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో టేకు కర్రతో రథం తయారు చేయడంతో పాటు భద్రాద్రి రామాలయ నిర్మాణం జరగడంతో ప్రజల్లో భక్తి భాగం పెరిగిందన్నారు. గురుస్వామి వుంగరాల వీరవెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు వింటి బాబ్జి, అధ్యక్షుడు పేర్నీడి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి యేలూరి శ్రీనివాసు, కోశాధికారి బావిశెట్టి వెంకటసత్యప్రసాద్, మండల పరిషత్ వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ ముమ్మిడి శివశంకర ప్రసాద్, వైఎస్సార్ సీపీ అయ్యారక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీ నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, పార్టీ నాయకులు కర్రి వెంకటసుబ్బారావు, అముజాల సూర్యనారాయణ తదితరులు భక్తులకు సేవలందించారు. అనంతరం సీతారాముల కల్యాణం, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి


మహిళా సంఘ సభ్యులకు చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

పిఠాపురం: డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆర్‌ఎం గంటా శ్రీనివాస్ అన్నారు. చేబ్రోలులోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా శక్తి సంఘాలకు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులకు రూ.1.1 కోట్ల చెక్కును అందించామన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. వాటన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, బ్యాంకు మేనేజర్ సుధీర్ లక్ష్మణస్వామి ఏపీఎంలు సన్యాసిరావు, సభీనా ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయాలి


కరపలో గ్రామ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామ పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని మండల ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. ఇంటి పన్నులు, పన్నేతర వసూళ్ల వెంటనే పూర్తి చేయాలన్నారు. స్వామిత్వ సర్వే త్వరితగతిన నిర్వహించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ) సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త విడి విడిగా సేకరించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు వస్తారని, ఈ నెల 20వ తేదీలోగా లక్ష్యాలను పూర్తిచేయాలని ఈఓపీఆర్డీ గ్రామకార్యదర్శులకు సూచించారు.

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

- సరకు నిల్వల్లో తేడాల గుర్తింపు
- 6ఏ కేసులు నమోదు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట, వాకలపూడి, తిమ్మాపురం, రాయుడుపాలెం, ఎస్.అచ్యుతాపురం గ్రామాల పరిధిలో ఐదు రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేశారు. రెండు రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేసినట్టు ఎంఎస్‌ఓ మమత తెలిపారు. రమణయ్యపేటలో షాప్ నంబరు 45లో బియ్యం 7070 కేజీలు అధికంగాను, పంచదార 68.5 కేజీలు తక్కువగా, కందిపప్పు 100 కేజీలు అధికంగా ఉన్నట్టు గుర్తించి డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. కొందరు వేలి ముద్రలు వేసేందుకు సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఆర్వో ద్వారా సరుకులు అందించినట్టు డీలర్ అధికారులకు తెలియజేశారన్నారు. వాకలపూడిలో షాప్ నంబరు 55లో 317 కేజీల తక్కువగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆత్మీయతతో విశ్వాసికి స్వస్థత


స్వస్థత మహాసభల్లో క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న యువతులు

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన ఆత్మీయ జీవన విధానంతో ప్రతీ విశ్వాసికి స్వస్థత లభిస్తుందని రాజమహేంద్రవరం వర్తమానికుడు రెవరెండ్ సతీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం (కెఎస్‌పీఎం) వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం ఆధ్వర్యంలో సోమవారం విరవ చర్చి ప్రాంగణంలో రక్షణ స్వస్థత మహాసభ నిర్వహించారు. సంతోష్ రెడ్డి దైవ ప్రసంగాన్ని అందిస్తూ ప్రతీ ఒక్కరిలో దేవుని పట్ల విశ్వాసం కల్గి ఉండాలన్నారు. నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దేవుని దీవెనలతో మంచి రక్షణ పొందాలనే ఆకాంక్షతో రక్షణ స్వస్థత మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దైవజనులు కాసా అభిషేక్, వంకా జాన్, జయకుమార్ తదితరులతో పాటు, సుమారు వెయ్యి మంది విశ్వాసులు పాల్గొన్నారు.

అశ్మరభ శరభ..


సర్పవరం గ్రామంలో వీరభద్రులను తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కాకినాడ రూరల్: వీరభద్రుడిని గద్దెకు అప్పగించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సర్పవరం గ్రామం సోమవారం సందడిగా మారింది. శరభ.. శరభ అంటూ భక్తులు తలపై వీరభద్రులను ధరించి ఊరేగి గ్రామంలోని ఒక ఇంటి వద్ద గద్దెకు అప్పగించారు.

సవిస్కార-2కె25లో విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్: నన్నయ యూనివర్సిటీలో నిర్వహించిన సవిస్కార-2కె25 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను స్థానిక అచ్చంపేట జంక్షన్‌లోని నన్నయ ఎంఎస్‌ఎన్ పీజీ సెంటర్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం విద్యార్థులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ అభినందించారు. 12 విభిన్న విభాగాలల్లో విద్యార్థులు ప్రతిభ చూపేందుకు కృషి చేసిన అధ్యాపకులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఆ విభాగాధిపతి అజయ్‌రత్నం, అధ్యాపకులు శ్రీరామరాజు, మధుకుమార్, మణికంఠేశ్వరరెడ్డి, మనోజ్ దేవ, శ్రీదేవి, ఉమా రజిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు


వేళంగి కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో సోమవారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభంకాగా తెలుగు పేపర్–2 పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. వేళంగి పరీక్షా కేంద్రంలో 99 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరై 96 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆచంట అంజిబాబు, డిపార్టమెంటల్ ఆఫీసర్ జె.డానియల్ ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఎస్సై టి.సునీత బందోబస్తు నిర్వహించారు.

సైన్స్ పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

బాలాజీచెరువు: పైండా సత్తిరాజు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం సైన్స్‌పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. వికసిత్ భారత్‌లో విజ్ఞానం, నూతన ఆవిష్కరణలో గ్లోబల్ నాయకత్వానికి భారత యువతను శక్తివంతం చేయడం అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 32 పాఠశాలల నుంచి 218 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వినీల్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.